పుస్తకంతో విజ్ఞానం

మాట్లాడుతున్న ఆర్‌జెడి వెంకట కృష్ణారెడ్డి

ఆర్డీవో మధుసూదన్

మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

ప్రజాశక్తి ఎడిషన్ మేనేజర్ ఎన్.వేణుగోపాల్

ప్రజాశక్తి పుస్తక ప్రదర్శనను ప్రారంభించి అందులోని పుస్తకాలను తిలకిస్తున్న గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఎల్ఎం.ఉమామోహన్‌రెడ్డి

- ప్రతి ఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి
- ప్రజాశక్తి బుక్ ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవంలో ఆర్‌జెడి ఎం.వెంకటకృష్ణారెడ్డి, ఆర్‌డిఒ మధుసూదన్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

పుస్తకం విజ్ఞానాన్ని నేర్పుతుందని, ప్రతి ఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని ఆర్‌జెడి వెంటకకృష్ణారెడ్డి తెలియజేశారు. అనంతపురం నగరం పోలీస్ కాంప్లెక్స్‌లోని ప్రజాశక్తి బుక్‌హౌస్ ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ప్రజాశక్తి అనంతపురం ఎడిషన్ మేనేజర్ ఎన్.వేణుగోపాల్ అధ్యక్షతన నిర్వహించిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్‌జెడితో పాటు ఆర్డీవో మధుసూదన్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఎల్ఎం.ఉమామోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్‌జెడి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. సాంకేతికంగా అభివృద్ధి సాధించిన రోజుల్లోనూ పుస్తకాలకు ఎంతో ఆదరణ ఉందన్నారు. ప్రజాశక్తి బుక్‌హౌస్ ప్రజలకు అందుబాటు ధరలతో మంచి పుస్తకాలు అందించడం అభినందనీయం అన్నారు. ఆర్డీవో మధుసూదన్ మాట్లాడుతూ చిరిగిన చొక్కా అయినా వేసుకో కాని మంచి పుస్తకాన్ని కొనుక్కొని చదువుకో అంటూ మహాకవి శ్రీశ్రీ చెప్పిన మాటలు అక్షర సత్యం అన్నారు. పుస్తక పఠనంతో పొందే ఆనందం, అనుభూతి ఎంతో గొప్పదన్నారు. మనల్ని గత చరిత్రను, భవిష్యత్ కాలాన్ని కూడా తీసుకెళ్లే శక్తి పుస్తకాలకు ఉందన్నారు. నాటి చరిత్రను తెలుసుకోగలిగామంటే ఎందరో మహనీయులు తాళపత్ర గ్రంథాలు, పుస్తకాల్లో పొందుపరచడం ద్వారానే సాధ్యమైందన్నారు. మృగాలను కూడా మనిషిగా మార్చే శక్తి మంచి పుస్తకానికి ఉందన్నారు. మంచి పుస్తకం చేతిలో ఉంటే ఎన్నో అద్భుతాలు సృష్టించే శక్తి లభిస్తుందన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఎల్ఎం.ఉమామోహన్‌రెడ్డి మాట్లాడుతూ పుస్తకాలకు ఎంతో ఆదరణ ఉందన్నారు. సామాజిక చైతన్యానికి మంచి పుస్తకాలు ఆయుధంగా నిలిచాయని తెలిపారు. గ్రంథాలయంలో ఎంతో విలువైన చారిత్రాత్మకమైన, చైతన్యవంతమైన పుస్తకాలు ఉన్నాయని తెలిపారు. పాఠకుల కోసం 40 లక్షల పుస్తకాలు అందుబాటులోకి తెచ్చామన్నారు. పుస్తక పఠనానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ప్రజాశక్తి మంచి మంచి పుస్తకాలను ప్రచురిస్తోందని అభినందనలు తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ ప్రజాశక్తి పుస్తక ప్రదర్శనతో పుస్తక ప్రియులకు పండుగను తీసుకొచ్చినట్లు ఉందన్నారు. సెల్‌ఫోన్, ఫేస్‌బుక్, వాట్సప్, ట్విట్టర్ వంటి సామాజిక మాధ్యమాలు వచ్చాక 90 శాతం పుస్తక విక్రయాలు తగ్గినట్లు తెలుస్తోందన్నారు. ఇలాంటి పరిస్థితిలో మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. పుస్తకాలకు పూర్వవైభం తీసుకురావడం కోసం ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. గ్రంథాలయాల ద్వారా ప్రతి కళాశాలలో బుక్‌క్లబ్ ఏర్పాటు చేయాలన్నారు. సాహితీవేత్తలతో పాటు అందరూ పుస్తక పఠనానికి నాంది పలకాలని కోరారు. ప్రజాశక్తి ఎడిషన మేనేజర్ వేణుగోపాల్ మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీ నుంచి 13వ తేదీ వరకు పుస్తక ప్రదర్శన ఉంటుందన్నారు. నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగ సందర్భంగా పుస్తకాలు డిస్కౌంట్‌తో విక్రయిస్తున్నట్లు తెలిపారు. అనంతరం అతిథులందరూ ప్రజాశక్తి పుస్తక ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ ఆర్‌జెడి వెంకటకృష్ణారెడ్డికి గాంధీ భారతదేశం పుస్తకాన్ని బహుకరించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఉమామోహన్‌రెడ్డి మహాకవి శ్రీశ్రీ సాహిత్య గ్రంథాన్ని కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక నాయకులు ఎస్ఎం.బాషా, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య, జిల్లా గౌరవాధ్యక్షులు రమణయ్య, సీనియర్ నాయకులు మహమ్మద్ జిలాన్, రచయిత రియాజుద్దీన్, నానీల నాగేంద్ర, టివి.రెడ్డి, జూటూరు షరీఫ్, అశ్వర్థరెడ్డి, శ్రీహరిమూర్తి, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు రామాంజినమ్మ, ప్రజాశక్తి బుక్‌హౌస్ ఇన్‌ఛార్జి శ్రీదేవి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు సూర్యచంద్రయాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గాంధీజీ రచించిన భారతదేశ చరిత్ర పుస్తకాన్ని ఆర్జేడీకి అందజేస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ఏ కష్టమొచ్చిందో..?

ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి చాణక్యా నందరెడ్డి

- హాస్టల్ పైనుంచి దూకి విద్యార్థి ఆత్మహత్య
- చదువులో బెస్ట్.. అన్నింటిలోనూ మంచి మార్కులు
- కన్నీటి పర్యంతం అయిన తల్లిదండ్రులు

చదువుల్లో బెస్ట్ స్టూడెంట్... అన్నింటిలోనూ మంచి మార్కులే... మెరిట్ స్కాలర్‌షిప్ సైతం పొందుతున్న విద్యార్థి. అయితే అతనికి ఏ కష్టమొచ్చిందో ఏమో తెలియదు.. తానుంటున్న హాస్టల్ భవనం పైనుంచి కిందకు దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉత్తమ విద్యార్థిగానున్న చాణక్యనందరెడ్డి ఈ రకంగా ఆత్మహత్యకు పాల్పడటం అధ్యాపకులను సైతం కంటతడి పెట్టించింది. రక్తపు మడుగులో యల్లోరా హాస్టల్ పక్కనున్న సిసిసి భవనం ముందు విగతజీవిగా పడిఉన్న విద్యార్థిని చూసి సహ విద్యార్థులు సైతం కన్నీటి పర్యవంతమయ్యారు.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

నెల్లూరు జిల్లా వరికుంటపల్లి మండలం జి.కొండాపురం గ్రామానికి చెందిన చాణక్యనందరెడ్డి అనంతపురం జెఎన్‌టియులోని ఇసిఇ విభాగంలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. యల్లోరా హాస్టల్‌లో ఉంటున్న చాణక్యనందరెడ్డి గురువారం తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో హాస్టల్ పక్కనున్న సిసిసి భవనంలోకెళ్లి అక్కడి నుంచి కిందకు దూకాడు. రక్తపుమడుగులో పడిఉన్న అతడినిచూసి విద్యార్థులు సమచారాన్ని ప్రిన్సిపాల్ సుజాతకు తెలియజేశారు. ఆమె వన్‌టౌన్ పోలీసులకు సమాచారమివ్వడంతో పోలీసులు విచ్చేశారు. వన్‌టౌన్ సిఐ రవిశంకర్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని అనంతపురం సర్వజన ఆసుపత్రికి తరలించారు. రాత్రి తోటి స్నేహితులతో కలిసి హాస్టల్‌లోని 131 గదిలో నిద్రించిన చాణక్యనందరెడ్డి తెల్లారేసరికి ఆత్మహత్య చేసుకుని కనిపించడం తోటి విద్యార్థులను విస్మయానికి గురిచేసింది. స్నేహితుడుకి తెల్లవారుజామున బై అని మెసేజ్ పెట్టగా, చెల్లెలుకు టేక్ కేర్ అని మెసేజ్ పెట్టి చనిపోయాడు.

చదువులో బెస్ట్..

చాణక్యనందరెడ్డి చదువుల్లో బాగా రాణిస్తూ వచ్చేవాడు. ఎంసెట్‌లో ఐదు వేల లోపు ర్యాంకు వచ్చింది. ఇసిఇ మొదటి సంవత్సరంలో 9.8 మార్కులు సాధించాడు. మెరిట్ స్కాలర్‌షిప్ సైతం సాధించాడు. చదువులో బాగా రాణిస్తున్న చాణక్యనందరెడ్డి ఈ రకంగాచనిపోవడం అందరినీ కలచివేసింది.

కన్నీటి పర్యవంతమైన తల్లిదండ్రులు

ఒక్కగానొక్క కుమారుడు చదవులో బాగారాణిస్తున్నాడు...మంచి భవిష్యత్ ఉంటుందని తల్లిదండ్రులు కోటి ఆశలు పెట్టుకున్నారు. కుమార్తెకు ఇటీవలనే నీట్‌లో సీటు వచ్చింది. కొడుకు, కుమార్తె ఇద్దరూ చదువులో ముందుకెళు_న్నారని తల్లిదండ్రులు భావించారు. అయితే ఉన్న ఫలంగా కుమారుడు ఆత్మహత్య చేసుకోవడంతో కన్నీటి పర్యవంతం అయ్యారు. కుమారిని మృతదేహం వద్ద వారి రోదనలు చూపరులను కన్నీరు పెట్టించాయి.

విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం

రవిశంకర్‌రెడ్డి, సిఐ.

విద్యార్థి మృతిపై వివరాలు సేకరిస్తున్నాం. ఆత్మహత్యకుగల కారణాలు ఏమిటన్న దానిపై స్పష్టతలేదు. పూర్తి స్థాయి విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం.

ఓటర్ల జాబితా వివరాలను కలెక్టర్‌కు అందజేస్తున్న అధికారులు

జిల్లా ఓటర్లు 13,43,312

- పురుష ఓటర్లు : 6,73,955
- మహిళలు : 6,69,294
- థర్డ్ జెండర్లు : 63

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

2023 జిల్లా ఓటర్ల తుది జబితాను కలెక్టర్ బసంత్‌కుమార్ విడుదల చేశారు. పుట్టపర్తి కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో గురువారం నాడు తుది ఓటర్ల జాబితా-2023ని విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా 13,43,312 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 6,73,955 మంది పురుష ఓటర్లు, 6,69,294 మంది మహిళా ఓటర్లు, థర్డ్ జెండర్లు 63 మంది ఉన్నారు. వీరిలో నూతనంగా 7,134 మంది ఓటర్లు వారి పేర్లను నమోదు చేసుకోగా, అందులో 3,395 మంది పురుష ఓటర్లు, 3,739 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. నియోజకవర్గాల వారీగా చూస్తే మడకశిర నియోజకవర్గంలో 1,05,099 మంది పురుష ఓటర్లు, 1,02,334 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. హిందూపురం నియోజకవర్గంలో 1,17,957 మంది పురుష ఓటర్లు, 1,15,407 మంది మహిళా ఓటర్లు, థర్డ్ జెండర్లు 18 మంది ఉన్నారు. పెనుకొండ నియోజకవర్గంలో 1,12,977 మంది పురుష ఓటర్లు, 1,10,549 మంది మహిళా ఓటర్లు, థర్డ్ జెండర్లు ముగ్గురు ఉన్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలో 1,00,042 మంది పురుష ఓటర్లు, 1,00,856 మంది మహిళా ఓటర్లు, థర్డ్ జెండర్లు 13 మంది ఉన్నారు. ధర్మవరం నియోజకవర్గంలో 1,16,541 మంది పురుష ఓటర్లు, 1,17,612 మంది మహిళా ఓటర్లు, థర్డ్ జెండర్లు 19 మంది ఉన్నారు. కదిరి నియోజకవర్గంలో 1,21,339 మంది పురుష ఓటర్లు, 1,22,536 మంది మహిళా ఓటర్లు, థర్డ్ జెండర్లు 10 మంది ఉన్నారు. తుది ఓటర్ల జాబితా-2023ని విడుదల చేసేందుకు కషిచేసిన అధికారులందరినీ కలెక్టర్ అభినందించారు. జిల్లాలో ఇంకా ఎవరైనా 18 సంవత్సరాలు నిండినవారు ఉంటే ఆన్‌లైన్‌లో ఓటరుగా నమోదు చేసుకోవచ్చన్నారు. www.ceoandhra.nic.in లేదా nvsp పోర్టల్ ద్వారా అర్హులైన వారు ఓటరుగా వారి పేరు నమోదు చేసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ మైనుద్దీన్, కలెక్టరేట్ తహశీల్దార్ శ్రీనివాసులు, ఐటీ సపోర్టర్ కల్పన, పుట్టపర్తి ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ నరసింహులు, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్లు రామకష్ణారెడ్డి, అశ్వర్థనారాయణ, శ్రీనివాసరెడ్డి, కదిరి ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ రామకష్ణారెడ్డి పాల్గొన్నారు.

అంబేద్కర్ సర్కిల్‌లో ఆందోళన చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ప్రజల ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా..

ఆందోళనలో ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

నియోజకవర్గవ్యాప్తంగా కల్తీ కల్లు తాగి ప్రజలు వారి ప్రాణాలను పోగట్టుకుంటున్నా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోరా.. అని ప్రజాసంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్తీ కల్లు దుకాణాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌లో ఆందోళన చేశారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం చేరుకుని తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కల్లు వ్యాపారులు విక్రయించే కల్లులో ఎక్కువ శాతం రసాయనాలు వేయడం వల్ల తీవ్రంగా నిషా ఎక్కి బానిసలు అవుతున్నారన్నారు. దీంతో కల్లు తాగకపోతే మతిస్థిమితం లేకుండా ప్రవర్తిస్తున్నారన్నారు. ఇలాంటి ఘటనలు లేపాక్షి మండలంలో గతంలో చోటు చేసుకుంటున్నాయన్నారు. దీంతో పాటు దీర్ఘకాలిక వ్యాధులు బారిన ప్రజలు పడుతున్నారన్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కల్తీ కల్లు వ్యాపారులను శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఎస్‌పి నాయకులు శ్రీరాములు, ఆర్‌సిపి నాయకులు శ్రీనివాసులు, ఇతర ప్రజా సంఘాల నాయకులు వినోద్‌కుమార్, చంటీ, రామాంజినేయులు, తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పిస్తాం..ఖాళీ చేయండి..

పూల వ్యాపారులతో మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ - రోడ్డుపై పూలేసి వ్యాపారుల నిరసన

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో నూతనంగా నిర్మించిన వాణిజ్య భవన సముదాయంలో సౌకర్యాలు కల్పిస్తామని, వెంటనే ఖాళీ చేయాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ సూచించారు. గురువారం పట్టణంలోని పశువర్ధక శాఖ డిడి కార్యాలయ ఆవరణలో పూలవ్యాపారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మార్కెట్ నిర్మాణం పూర్తయి ప్రారంభమైనప్పటికీ వ్యాపారులు దుకాణాలను మార్చలేదన్నారు. వెంటనే ఖాళీ చేయాలని, లేనిపక్షంలో శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. దీంతో వ్యాపారులు పూలను రోడ్డుపై పడేసి ఆందోళన చేశారు. అనంతరం ఎమ్మెల్సీ నివాస గృహానికి వెళ్లారు. ఆయన అందుబాటులో లేకపోవడంతో మున్సిపల్ కార్యాలయానికి వచ్చి, మున్సిపల్ ఛైర్‌పర్సన్‌తోపాటు వైస్ ఛైర్మన్ జబీవుల్లాలను కలిసి సమస్యను వివరించారు. తమకు కేటాయించిన స్థలంలో కనీస సౌకర్యాలు లేకపోవడంతోనే ఇప్పటి వరకు మార్కెట్‌లో లావాదేవీలు చేసుకోలేకపోతున్నామనానరు. సౌకర్యాలు కల్పిస్తే వెంటనే మార్కెట్‌లో వ్యాపారాలు చేస్తామని వివరించారు. ఇందుకు ఛైర్‌పర్సన్, వైస్‌ఛైర్మన్ మాట్లాడుతూ నూతనంగా నిర్మించిన మార్కెట్‌లో పూల వ్యాపారులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, వెంటనే ఖాళీ చేయాలని సూచించారు. అయితే పశువర్ధక శాఖ అధికారులతో చర్చించి మరో రెండు నెలలు గడువు ఇచ్చించాలని వ్యాపారులు కోరగా ఇప్పటికే చాలాసార్లు వారితో గడువు ఇప్పించామని, రూ.కోట్లు ఖర్చు చేసి మార్కెట్ నిర్మిస్తే వ్యాపారులు చేసుకోకపోతే ఎలా అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రోడ్డుపై పూలు పడేసి ఆందోళన చేస్తున్న పూల వ్యాపారులు

ఖబరస్తాన్ నేలమట్టం దుర్మార్గమైన చర్య

పరిటాల శ్రీరామ్

కబరస్తాన్‌ను పరిశీలిస్తున్న పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ఏళ్ల తరబడి ముస్లిములు చనిపోయిన వారి తల్లిదండ్రులను పూడ్చిపెట్టే ఖబరస్తాన్ (సమాధులు)ను ధ్వంసం చేయడం దుర్మార్గమైన చర్య అని ధర్మవరం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని గాంధీనగర్‌లో ఉన్న ముస్లిం ఖబరస్తాన్‌లో బుధవారం రాత్రి చదును చేసే కార్యక్రమాలను ముస్లిం పెద్దల ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ పనులను ఏకపక్షంగా చేస్తున్నారంటూ కొందరు ఆరోపించడంతో ఇది వివాదంగా మారింది. ఈ నేపథ్యంలో కబరస్తాన్‌ను పరిటాల శ్రీరామ్ గురువారం ఉదయం పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ధర్మవరంలో ఏళ్లతరబడి ఉన్న ముస్లింల కబరస్తాన్‌ను నేలమట్టం చేయడం దారుణమన్నారు. కనీసం ముస్లిం మతపెద్దలతో సంప్రదింపులు జరపకుండా కొందరు మతపెద్దలు ఏకపక్షంగా సమాధులను ఎలా పూడ్చి వేస్తారని ప్రశ్నించారు. ఇది ముస్లిముల మనోభావాలను దెబ్బతీయడమే అవుతుందన్నారు. ఇది అనాగరిక, ఆటవిక చర్య అన్నారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఉదయం గుడ్ మార్నింగ్‌కు వెళ్లి, గుడ్‌నైట్ సమాధులను కూల్చే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. కబరస్తాన్‌లో అభివృద్ధి పేరుతో సమాధులను తొలగించే చర్యలను తక్షణం ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కమతం కాటమయ్య ఫణికుమార్, నాగూర్‌హుస్సేన్, పఠాన్ బాబుఖాన్, చింతపులుసు పెద్దన్న పురుషోత్తంగౌడ్, క్రిష్ణాపురం జమీర్ అహమ్మద్, రాళ్లపల్లి షరీఫ్, అత్తర్ హిమామ్ బాషా, షామీర్, భీమనేని ప్రసాద్‌నాయుడు, అంబటి సనత్, ఉస్మాన్, చీమల రామాంజి పాల్గొన్నారు.

ముస్లిముల మధ్య చిచ్చుపెట్టొద్దు

- 40 మసీదుల ఆమోదంతోనే పనులు చేపట్టాం
- టిడిపి నేతలకు ముతవల్లీల హితవు

విలేకరులతో మాట్లాడుతున్న ముస్లిం మత పెద్దలు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ధర్మవరం పట్టణంలోని గాంధీనగర్ వద్దనున్న కబరస్తాన్‌లో మురుగునీరు ఎక్కువై అపశుభ్రత నెలకొన్న నేపథ్యంలో 40 మసీదుల కమిటీ సభ్యులతో చర్చించి, సమాధులను చదును చేసే కార్యక్రమాన్ని చేపట్టినట్లు జామియా మసీదు ముతవల్లి ముస్తాక్ అహమ్మద్, మత పెద్దలు రహంతుల్లా, సయ్యదమునాఫ్, జాకీర్ హుస్సేన్, ఖలీల్ తెలిపారు. కబరస్తాన్‌లో గురువారం నాడు ముస్లిం మతపెద్దలు విలేకరులతో మాట్లాడారు. ముస్లిముల మధ్య చిచ్చుపెట్టేలా టిడిపి నాయకులు రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. నిజాలు తెలుసుకోకుండా పరిటాల శ్రీరామ్ ఆరోపణలు చేయడం సరికాదని సూచించారు. గతేడాది అక్టోబర్ నెలలో జామియా మసీదులో పట్టణంలోని 40 మసీదుల కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించి, ప్రస్తుతమున్న కబరస్తాన్‌లో చదును చేసే కార్యక్రమంపై నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. మట్టితో చదును చేయించి, తరువాత అక్కడున్న సమాధులను యథావిధిగా ఉంచేలా ఆమోదం తీసుకున్నట్లు చెప్పారు. ఇది తెలుసుకోకుండా మసీదులు ఆక్రమించి, ప్లాట్లు వేస్తున్నారంటూ టిడిపి నాయకులు ఎమ్మెల్యే కేతిరెడ్డిపై విమర్శలు చేయడం సరికాదన్నారు. రాజకీయ రంగుపులిమే ఇలాంటి చర్యలను టిడిపి నేతలు మానుకోవాలని హితవు పలికారు. ముస్లింల అభివద్ధి కోసమే ముతవల్లీలు నిరంతరం కషి చేస్తున్నారని తెలిపారు.

స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై దృష్టి : కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

స్థిరమైన అభివద్ధి లక్ష్యాలపై ప్రత్యేక దష్టి సారించాలని, ఆయా శాఖల పరిధిలో పూర్తిస్థాయిలో లక్ష్యాలను చేరుకునేందుకు అధికారులు నిరంతరం మానిటర్ చేయాలని కలెక్టర్ బసంత్ కుమార్ ఆదేశించారు. గురువారం పుట్టపర్తి కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో స్థిరమైన అభివద్ధి లక్ష్యాలు (సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్)పై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్థిరమైన అభివద్ధి లక్ష్యాలపై రాష్ట్ర ముఖ్యమంత్రి స్థాయిలో అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. జిల్లాకు కేటాయించి స్థిరమైన అభివద్ధి లక్ష్యాలకు సంబంధించిన లక్ష్యాలను ఇప్పటివరకు ఎంతవరకు చేరుకున్నారు, ఇంకా ఎంత లక్ష్యం చేరుకోవాల్సి ఉంది అనే దానిపై నిత్యం మానిటర్ చేయాలన్నారు. క్షేత్రస్థాయి వరకు పర్యవేక్షణ చేయాలని, స్థిరమైన అభివద్ధి లక్ష్యాల వివరాలను ఎలాంటి గ్యాప్ లేకుండా పూర్తిస్థాయిలో సేకరించాలని, ఇందుకోసం ప్రత్యేక దష్టి పెట్టాలన్నారు. ఈ సమావేశంలో సిపిఒ విజయ్‌కుమార్, డిఇఒ మీనాక్షి, పంచాయతీ రాజ్ ఎస్ఈ గోపాల్ రెడ్డి, డిఎంహెచ్ఒ కష్ణారెడ్డి, సోషల్ వెల్ఫేర్ డిడి శివరంగ ప్రసాద్, డ్వామా పీడీ రామాంజనేయులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ రషీద్ ఖాన్, పట్టుపరిశ్రమ శాఖ జెడి పద్మమ్మ, అగ్రికల్చర్ జిల్లా అధికారి సుబ్బారావు, హార్టికల్చర్ జిల్లా అధికారి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి

నంబుల పూల కుంట : న్యూస్ రబీసీజన్లో పంట సాగుచేసుకున్న రైతులు తమ పంట వివరాలను నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి వి.లోకేశ్వర్ రెడ్డి కోరారు. మడలంలోని పెడబల్లి, పి. కొత్తపల్లి, గౌకనపల్లి, వెలిచలమల గ్రామాలలో పర్యటించి సిబ్బంది నమోదు చేస్తున్న రబి ఈ పంట నమోదు ప్రక్రియను పరిశీలించారు.

పరిగి : మండలంలోని ఊటుకూరు రైతు భరోసా కేంద్ర పరిధిలోని వరి పంట పొలాలను ఎఒ విజయభారతి గురువారం పరిశీలించారు. పంటసాగు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు ఈసందర్భంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విలేజ్ సిరికల్చర్ అసిస్టెంట్ మంజుల, రైతులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

పుట్టపర్తి రూరల్ : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ జోష్న తెలిపారు. ఈ మేరకు ఆమె వైద్య బృందంతో కలిసి మండల పరిధిలోని నిడిమామిడి గ్రామంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురికి వైద్యసేవలు అందించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ నగేష్, హెడ్ మాస్టర్ అబ్దుల్ రహిమాన్, సూపర్ వైజర్లు వెంకట రమణ, చంద్రకళ, ఎంఎల్‌హెచ్‌పి సుస్మిత, ఆరోగ్య కార్యకర్త శివ, మంజులవాణి, ఆశా కార్యకర్తలు నిర్మల, మమతాజ్, హసీనా, పార్వతమ్మ 104 సిబ్బంది లక్ష్మీపతి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఉరుసు సందర్భంగా అన్నదానం

పెనుకొండ : బాబయ్య స్వామి750 వ ఉరుసు సందర్భంగా పట్టణంలోని ఆర్‌టిసి బస్ స్టాండ్ సమీపంలో తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు ఆధ్వర్యంలో గురువారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బి.కె. పార్థసారథి, కదిరి మాజీ ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ యాదవ సంఘం నాయకులు కేశవయ్య, పార్లమెంట్ కార్యదర్శి మునిమడుగు వెంకట్రాముడు, మాజీ సర్పంచి అశ్వర్థప్ప, పార్లమెంట్ అధికార ప్రతినిధి రొద్దం నరసింహులు, నియోజకవర్గం కమిటీ అధ్యక్షులు చిన్నప్పయ్య తదితరులు పాల్గొన్నారు.అదే విధంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వ కార్యదర్శి సవితమ్మ వెంకటేశ్వర రావు ఆధ్వర్యంలో భోజన వసతి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాధవ నాయుడు, వెంకట రమణ, సూర్యనారాయణ, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలదేవరపల్లిలో పొలంబడి

లేపాక్షి : మండలంలోని తిరుమలదేవరపల్లి గ్రామంలో రైతు శ్రీనివాసరెడ్డికి చెందిన మొక్కజొన్న పొలంలో పొలంబడి కార్యక్రమాన్ని ఎఒ శ్రీలత ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా పంటసాగు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ పుష్పలత, వివిఎ విజయ్ కుమార్, రైతులు ఆనంద్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధి పనులు ప్రారంభం

చిలమత్తూరు : మండలంలోని శెట్టిపల్లి గ్రామ సర్పంచి చామంతి, ఎంపీటీసీ జగన్మోహన్ రెడ్డి తమ సొంత నిధులతో ఎస్సీ కాలనీలోని సల్లాపురమ్మ ఆలయ అభివృద్ధి పనులను గురువారం ప్రారంభించారు. 2019 ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు గురువారం ఆలయానికి స్లాబ్ పనులు పూర్తి చేశారు.

సిబిఎస్ఇ విధానంపై ఉపాధ్యాయులకు శిక్షణ

హిందూపురం : జిల్లావ్యాప్తంగా సిబిఎస్ఇకి ఎంపిక చేసిన 49 పాఠశాలల్లో 25 పాఠశాలల ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయులకు గురువారం పట్టణంలోని వివేకానంద మిలీనియం పాఠశాలలో సమగ్ర శిక్ష ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో అసిస్టెంట్ ఎఎంఒ మహేంద్రరెడ్డి పర్యేక్షణలో గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విషయ నిపుణులు వినీత, రెజినా, సర్వేశ్వరి, లక్ష్మీనారాయణలు పాల్గొన్నారు.

కుప్పంలో ప్రజాస్వామ్యం ఖూనీ

ధర్మవరం టౌన్ : చిత్తూరు జిల్లా కుప్పంలో సిఎం జగన్ రెడ్డి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని టిడిపి ఎస్సీసెల్ మండల అధ్యక్షులు రేగాటిపల్లి వరదరాజులు విమర్శించారు. గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేగా కుప్పంకు వెళ్లిన చంద్రబాబును అడ్డుకోవడం నియంతపాలనకు పరాకాష్టకు చేరిందన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా పర్యటన చేస్తున్నా అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమన్నారు. రోడ్‌షోలు, సభలు నిర్వహించరాదని రాత్రికిరాత్రి చీకటి జీఓలతో ప్రతిపక్షాలను అడ్డుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో రాక్షస రాజ్యం నడుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఎస్సీ నాయకులు నరసింహులు, ఆదినారాయణ, ఎంజి ఆదెప్ప, మల్లికార్జున, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మడకశిర : కుప్పంలో చంద్రబాబు నాయుడు పర్యటనను అధికార వైసిపి పార్టీ నేతలు అడ్డుకోవడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసినట్లేనని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఈరన్న విమర్శించారు. ఈ మేరకు ఆయన గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ నియంత పాలన ఎన్నో రోజులు సాగదని అన్నారు. ప్రజలు తగిన సమయంలో బుద్ధి చెబుతారని జోస్యం చెప్పారు. ఈసమావేశంలో టిడిపి నాయకులు ఆదినారాయణ, ప్రకాష్, రామాంజనేయులు, దయానంద, రమేష్, శ్రీనివాసులు, ఈశ్వర్ సాగర్,మాజీ డీలర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కనకదాస విగ్రహ ఏర్పాటుకు కృషి

ధర్మవరం టౌన్ : పట్టణంలో కనకదాస విగ్రహ ఏర్పాటుకు కృషి చేద్దామని భాగ్యలక్ష్మి శిల్క్‌హౌస్ యజమాని గోసే రాధాకృష్ణ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక గిర్రాజు కాలనీలో ఉన్న భాగ్యలక్ష్మి శిల్క్‌హౌస్‌లో కనకదాస ఉపాధ్యాయ, విద్యా సంక్షేమ సంఘం నూతన క్యాలెండర్‌ను విడుదల చేశారు. ముందుగా క్యాలెండర్లకు విరాళం అందజేసిన గోసే రాధాకృష్ణను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మవరంలో కనకదాస విగ్రహ ఏర్పాటుకు అందరితోపాటు తనవంతు సహాయ, సహకారాలు అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలయ్య, వెంకటరాముడు, రమేష్, ఓబులేసు, రామంజి, నాగభూషణ, మల్లికార్జున, చంద్రశేఖర్, రామకృష్ణ, జయరాం, నాగేంద్ర, వేణుగోపాల్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు పరుపులు పంపిణీ

హిందూపురం : పట్టణంలోని బాలాజీనగర్‌లో ఉన్న శ్రీవేంకటేశ్వర ఆశ్రమంలో ఉన్న వృద్ధులందరికీ వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ తన సొంత నిధులతో పరుపులు, పండ్లు అందించారు. వీటిని గురువారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ ఆశ్రమంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ షేక్ రేష్మా బాను, కోఆప్షన్ మెంబర్ రహమత్, వైసిపి నాయకులు బాబు, ముస్తఫా, 4వ వార్డు కన్వీనర్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌కు జాతీయ అవార్డు

ధర్మవరం టౌన్ : విద్యావ్యవస్థలో అందించిన విశిష్టసేవలను గుర్తించి అందించిన జాతీయ అవార్డును ధర్మవరం వివేకానంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రిజ్వానాబాషాకు పెనుకొండ దర్గా పీఠాధిపతి తాజ్బాబా అందించారు. ఈమేరకు పెనుకొండ దర్గా 750 ఉరుసు ఉత్సవాల సందర్భంగా గురువారం ప్రిన్సిపల్ రిజ్వాన్బాషాకు అందజేశారు.

భూ సర్వే వేగవంతం : సబ్‌కలెక్టర్

సోమందేపల్లి : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్ ఆదేశించారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేసారు. మండల సమస్యలపై తహశీల్దార్ మురళీకృష్ణను అడిగి తెలుసుకొన్నారు. మండలం లోని పత్తికుంటపల్లి గ్రామానికి చెందిన గంగప్ప భూమి సమస్యపై తహశీల్దార్ తో చర్చించి అందుకు సంబందించిన రికార్డులను పరిశీలించారు. మండల కేంద్రములో వైస్సార్ సర్కిల్ లో నివాసం ఉంటున్న రుక్మిణి దేవికి 2001 సంవత్సరంలో ఇంటి నిర్మాణం కోసం స్థలం కేటాయించారు. అయితే అందులో నిర్మాణం పనులు చేపట్టక పోవడంతోపాటు ఆమె స్థానికంగా లేకపోవడంతో దానిని మీరా బాయ్ అనే మహిళకు బదిలీ చేసి పట్టా మంజూరు చేసారు. దీంతో మీరాబాయ్ కి హౌసింగ్ మంజూరు కావడంతో పునాది వేసుకొంది. తనకు కేటాయించిన స్థలంలో ఎలా పునాది వేసుకొన్నావంటూ కొన్ని నెలలుగా రుక్మిణిబాయి తహశీల్దార్‌కు, పోలీస్ స్టేషన్ లో, గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేసుకొంది. దానిని పరిశీలించిన సబ్ కలెక్టర్ ఇందులో సర్వ హక్కులు మీరాబాయికే చెందుతాయని తేల్చారు. ఈసందర్భంగా పలువురు రైతులు, మహిళలు తమ సమస్యలను సబ్ కలెక్టర్ కు విన్నవించుకొన్నారు. ప్రజాసమస్యలపై దృష్టిసారించి వాటి పరిష్కారానికి వెంటనే కృషి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ శ్రీకాంత్, జూనియర్ అసిస్టెంట్ సోమశేఖర్, వీఆర్వోలు రామకృష్ణ, యమున తదితరులు పాల్గొన్నారు.

ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాలి

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

నవరత్నాలలో భాగంగా జగనన్న ఇల్లు నిర్మాణాలు ఉగాది నాటికి నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని చీఫ్ సెక్రటరీ డాక్టరు జవహర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం వెలగపూడి సచివాలయం నుండి జిల్లా కలెక్టర్లు సంయుక్త కలెక్టర్లతో రెవిన్యూ, రీ సర్వే, వ్యవసాయం, హార్టికల్చర్, గృహ నిర్మాణం, వివిధ ప్రభుత్వ పథకాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పుట్టపర్తి కలెక్టరేట్ లో వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ బసంత్ కుమార్, డిఆర్ఓ కొండయ్య వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జవహర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గృహ నిర్మాణాలు 5 లక్షలు పూర్తి చేయాలన్నారు. రబీ సీజను ఈ క్రాప్ బుకింగ్ గడువులోగా వంద శాతం పూర్తి చేయాలన్నారు. పిఎం కిసాన్ పథకం క్రింద అర్హులైన రైతుల ఈకేవైసీ చేయించాలన్నారు. మైక్రో ఇరిగేషన్ లో భాగంగా అర్హులైన వారిని ఎంపిక చేసి ఆ మేరకు పూర్తి లక్ష్యం సాధించాలన్నారు. వైఎస్ఆర్ చేయూత పథకం క్రింద జీవనోపాధి కోసం స్వయం సహాయక సంఘాల మహిళల కు రుణాలు ఇప్పించాలన్నారు. జాతీయ రహదారుల పనికి సంబంధించి భూ సేకరణ పూర్తి చేయాలన్నారు. గడపగడపకు మన ప్రభుత్వంలో మంజూరైన పనులు పూర్తిస్థాయిలో పూర్తి చేయాలన్నారు. కలెక్టరు బసంత్ కుమార్ మాట్లాడుతూ పథకాలన్నీ నిర్దేశిత గడువులోగా పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఒ విజయ్ కుమార్, సర్వే ల్యాండ్స్ రికార్డ్స్ అధికారి రామకృష్ణ, డిఇఒ మీనాక్షి, పిఆర్ఎస్ఇ గోపాల్ రెడ్డి, డిఎంహెచ్ఓ కృష్ణారెడ్డి, డ్వామా పీడీ రామాంజనేయులు, వ్యవసాయ అధికారి సుబ్బారావు, పట్టు పరిశ్రమ జెడి పద్మమ్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న కలెక్టర్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

బుక్కపట్నం : అర్హులందరికీ ప్రజా సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలో నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి నాగలక్ష్మి రాజు, ఎంపీపీ శ్రీధర్ రెడ్డి, జెడ్పీటీసీ శ్రీలత గోవర్ధన్ రెడ్డి , ఎంపీడీవో శ్రీనివాసులు, ఈవోఆర్డీ ఇందిరాబాల, అగ్రి అడ్వైజరీ చైర్మన్ రమణారెడ్డి , వైస్ ఎంపీపీ రత్నాకరం పార్వతి, రామలింగారెడ్డి, కన్వీనర్ సుధాకర్ రెడ్డి, ఎంపీటీసీ పద్మావతి, నాయకులు కొత్తకోట కేశప్ప , నారాయణస్వామి , నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అవినీతి రహిత పాలన అందిస్తున్నారని పుట్టపర్తి ఎమ్మెల్యే డి శ్రీధర్ రెడ్డి తెలిపారు కొత్తచెరువులోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో గురువారం నిర్వహించిన నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. సచివాలయాల ద్వారా సత్వరమే ప్రజలకు సేవలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ జగన్మోహన్ రెడ్డి, ఎంపీపీ గాయత్రి రెడ్డప్ప రెడ్డి, మేజర్ పంచాయతీ సర్పంచి రాధా నాగరాజు, వైస్ ఎంపీపీ గంగరాజు, సరళ, రామచంద్ర, వైసిపి నాయకులు శ్యాంసుందర్ రెడ్డి, వాల్మీకి శంకర్, భాస్కరత పాటు ఆయాశాఖల అదికారులు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్ : పింఛన్లు తొలగిస్తున్నారని ఆందోళన చెందవద్దని అర్హులైన వారందరికీ పింఛన్లు ఇస్తామని శాసనసభ్యుడు దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మున్సిపాలిటీ కార్యాలయంలో కొత్తగా మంజూరైన పింఛన్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక కారణాలు ఇతరత్రా కారణాల వల్ల కొందరి పేర్లు లేకపోయినా, అధికారులు పరిశీలిస్తారని అర్హులైన వారందరికీ పింఛన్లు ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, చైర్మన్ తుంగ ఓబుళపతి, వైస్ చైర్మన్లు శ్రీలక్ష్మీ నారాయణ రెడ్డి, తిప్పన్న, కౌన్సిలర్లు చెరువు భాస్కర్ రెడ్డి, సాయిగీత, సూర్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్ అందజేస్తామని ఎమ్మెల్సీ ఇక్బాల్ చెప్పారు. గురువారం చిలమత్తూరు ఆర్‌బికెలో ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన పింఛన్ల పంపిణీని చేపట్టారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఇచ్చిన హామీ మేరకు ఇచ్చిన మాటకు కట్టుబడి సంక్షేమ పథకాలను అమలు పర్చుతున్నామన్నారు. ఈ కార్యక్రమం లో ఎంపిడిఒ రామ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘనీ, వేణుగోపాల్ రెడ్డి, మండల కన్వీనర్ ప్రభాకర్ రెడ్డి, ఎంపిటిసి జగన్ మోహన్ రెడ్డి, సర్పంచి సంధ్య, వైసిపి నాయకులు నాగరాజు, సర్పంచి ఈడిగ తిరుమలేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

తనకల్లు : మండల పరిధిలోని వంకపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న ఆలయానికి కదిరి మాజీ ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ రూ. 5 లక్షల విరాళాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన సహాయ సహకారాలు ఉంటాయని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రెడ్డి శేఖర్ రెడ్డి, మాజీ కన్వీనర్లు బీగం శంకర్ నాయుడు, బడా రాజారెడ్డి, దేశాయ్ ప్రభాకర్ రెడ్డి, ఉత్తన్న నాయక్, మాధవరెడ్డి, కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

నాయకులతో మాట్లాడుతున్న కందికుంట

బాధితులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే : మండల కేంద్రంలోని తారక రామా నగర్ లో నివసించే ఉపాధ్యాయుడు శివశంకర్ తల్లి మృతిచెందడంతో విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ రెడ్డి శేఖర్ రెడ్డి, మాజీ కన్వీనర్లు బడా రాజారెడ్డి, బీగం శంకర్ నాయుడు, సరోజమ్మ దామోదర్, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

రైతు సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - తనకల్లు

రైతు సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన వ్యవసాయ మాసపత్రిక మన రైతు వాణి 2023 క్యాలెండర్‌ను కదిరి శాసనసభ్యులు డాక్టర్ పివి సిద్ధారెడ్డి, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బడా సుబ్బిరెడ్డి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బడా సుబ్బిరెడ్డి మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని ఆకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు ఎకరానికి 25 వేల రూపాయలు పరిహారం ఇవ్వాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వివి రమణ, జిల్లా కమిటీ సభ్యులు శివన్న, ఎస్‌వి రమణ, నరసింహారెడ్డి ఎ. ఆంజనేయులు బి. రమేష్, వి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బాబయ్య స్వామి దర్గా గంధం వేడుకలు

తాజ్‌బాబాకు జ్ఞాపికను అందజేస్తున్న ప్రముఖులు

ప్రజాశక్తి -పెనుకొండ

మతసామరస్యానికి ప్రత్యేకంగా నిలిచిన బాబయ్య స్వామి దర్గా 750 వ గంధం వేడుకలు గురువారం కన్నుల పండువగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థన నిర్వహించి వంశపారంపర్య దర్గా పీఠాధిపతి తాజ్ బాబా ఆధ్వర్యంలో గంధంను దర్గాకు కాబోయే వంశపారంపర్య పీఠాధిపతి సలావుద్దీన్ బాబా తీసుకువెళ్లారు.ఈ సందర్భంగా దర్గా లో బాబయ్య సమాధి వద్ద గంధం ను ఉంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున మత పెద్దలు, బాబయ్య స్వామి భక్తులు తాజ్ బాబా శిష్య బృంద సభ్యులు పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పెనుకొండ డిఎస్‌పి హుస్సేన్ పీరా ఆధ్వర్యంలో సిఐలు, ఎస్ఐలు, పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

పెనుకొండలో మతసామరస్యం

మత సమరస్యానికి ప్రతీకగా నిలిచిన పెనుకొండ ప్రాంతంలో మతసామరస్యం వెల్లువిరుస్తూనే ఉంటుందని బాబయ్య స్వామి దర్గా వంశపారంపర్య పీఠాధిపతి తాజ్ బాబా పేర్కొన్నారు. బుధవారం రాత్రి స్థానిక సందల్ మహల్ వద్ద గల ఆవరణంలో ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా సర్వమత సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా నేషనల్ ఇంటిగ్రేషన్ అవార్డ్స్ ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో తాజ్ బాబా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సోదరభావంతో మెలగాలన్నారు. 50 మంది ప్రముఖులకు పెనుకొండ దర్గా నేషనల్ ఇంటిగ్రేషన్ అవార్డ్స్ ను ఈ అవార్డులను ముస్లిం నగారా జాతీయ అధ్యక్షులు ఉమర్ ఫారూఖ్ ఖాన్, శ్రీ సత్యసాయి జిల్లారచయితల సంఘం అధ్యక్షులు జాబిలి చాంద్ బాషా నేతత్వంలో తాజ్ బాబా, పెనుకొండ డి ఎస్ పి హుస్సేన్ పీరా చేతులు మీదుగా ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో కర్నూల్ కు చెందిన సాయి సంస్థాన్ పీఠాధిపతి శివ సాయి గురుజీ, కర్నాటకకు చెందిన శివ మృత్యుంజయ స్వామీజీ, బ్రహ్మకుమారీ విశ్వవిద్యాలయం డాక్టర్ హేమలత సిస్టర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

అమరాపురం : మండలంలోని శివరం గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతిచెందింది. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు... గ్రామానికి చెందిన గీతమ్మ అనే మహిళ దోసకాయ పంటలో కూలీ నిమిత్తం నిత్య వెళుతుంది. ఈ నేపథ్యంలో గురువారం ఆమెతో పాటు 28మంది ట్రాక్టర్‌తో వెళ్లారు. వీరు వెళుతున్న ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈసందర్భంగా పక్కనే ఉన్న గుంతలోకి పల్టీ కొట్టడంతో అక్కడికక్కడే గీతమ్మ మృతిచెందింది. మిగిలిన కూలీలకు గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి, డాక్టర్ నళిని రంగ గౌడ్ స్పందించి క్షతగాత్రులను మెరుగైన చికిత్స నిమిత్తం హిందూపురం, సిర, తుంకూరు, బెంగుళూరు ఆసుపత్రులకు తరలించారు. మృతురాలు గీతమ్మ భర్త తిప్పేస్వామి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

యువకుడు ఆత్మహత్య

కొత్తచెరువు : మండల పరిధిలోని మామిళ్ళకుంట క్రాస్ చెందిన నరేష్ (19) బుధవారం రాత్రి ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు... బేల్దారి పని చేసుకుని జీవిస్తున్న నరేష్ ప్రేమ విఫలం అవడంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లింగన్న తెలిపారు.

కల్తీ కల్లు విక్రయిస్తే కఠిన చర్యలు

హిందూపురం : హిందూపురం రూరల్ మండలంతో పాటు హిందూపురం, మడకశిర నియోజకవర్గవ్యాప్తంగా కల్తీ కల్లు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ విజిలెన్స్ సిఐ అన్నపూర్ణ హెచ్చరించారు. బుధవారం రాత్రి హిందూపురం రూరల్ మండలం చౌళూరులో కల్తీ కల్లు తాగి యువకుడు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. దీంతో ఎక్సైజ్ విజిలెన్స్ అధికారుల బృందం చౌళూరు గ్రామంలో ఉన్న కల్లు దుకాణాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ చౌళూరు గ్రామంలో కల్తీ కల్లు తాగి సతీష్ అస్వస్థతకు గురైన విషయం తెలిసి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. మూడు దుకాణాలకు అనుమతులు ఉన్నాయని, అనుమతి లేని దుకాణ నిర్వాహకులు శనివారప్పను అరెస్టు చేశామన్నారు. మిగిలిన మూడు దుకాణాల్లో కల్లు కల్తీ అయినట్లు ప్రాథమికంగా ధ్రువీకరణ అయినట్లు తెలిపారు. ఈ పరిశీలనలో ఎక్సైజ్ విజిలెన్స్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పట్టించుకోని ప్రభుత్వం

గుడిబండ : రాష్ట్రంలోని ప్రభుత్వం ప్రజా సమస్యలను విస్మరించిందని తెలుగుదేశం పార్టీ నాయకులు విమర్శించారు. మండల పరిధిలోని మైనగానపల్లిలో గురువారం తెలుగుదేశం పార్టీ చేపట్టిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈసందర్భంగా ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి కమిటీ మాజీ చైర్మన్ శివకుమార్, మండల బీసీ సెల్ అధ్యక్షులు నారాయణప్ప, నియోజకవర్గం మైనార్టీ అధ్యక్షులు నజీర్, క్లస్టర్ ఇన్‌ఛార్జులు భీమరాజు, లక్ష్మీ నర్సప్ప తదితరులు పాల్గొన్నారు

టిడిపిలోనే బిసిలకు రాజకీయ గుర్తింపు : బికె

పెనుకొండ : బీసీ లకు రాజకీయంగా గుర్తింపు నిచ్చింది తెలుగు దేశం పార్టీనే అని టిడిపి జిల్లా అధ్యక్షులు బికె. పార్థసారథి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బి.కె.పార్థసారథి అధ్యక్షతన శ్రీసత్యసాయి జిల్లా పార్టీ బిసి విభాగపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బికె మాట్లాడుతూ అసంపూర్తిగా వున్న బిసి కమిటీలను జనవరి 10 వ తేదీ లోపు ఏర్పాటు చేయాలన్నారు. పార్టీ బలోపేతం కోసం అనుబంధ సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి కదిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జికందికుంట వెంకటప్రసాద్, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప,సత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మీ నారాయణ, దాసరి శ్రీధర్, కుంటిమద్ది రంగయ్య, గిరిధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ తాగునీరు సరఫరా

గాండ్లపెంట : ప్రతి ఇంటికి తాగునీటిని సరఫరా చేస్తామని ఎంపిడిఒ అంజనప్ప తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జల జీవన్ మిషన్ హర్ గల్ జల్ అంశంపై సర్పంచులు సచివాలయ సిబ్బంది పంచాయతీ కార్యదర్శులకు ఒక్కరోజు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జల జీవన్ మిషన్ ప్రాజెక్టు అమలు కోసం గ్రామ నీటి పారిశుద్ధ కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాతం జగన్మోహన్, జల జీవన్ మిషన్ జిల్లా మేనేజర్ నాగం జనారెడ్డి, స్వచ్ఛభారత్ శ్రీనివాసులు, సంస్థ చైర్మన్ గోపాల్ రెడ్డి, ఐఒఆర్‌డి సునీత, ఆర్‌డబ్ల్యూఎస్ జెఇ కిరణ్ కుమార్ రెడ్డి, సర్పంచులు రహంతుల్లా, శివప్పరాయుడు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేటు పాఠశాలలపై చర్యలకు డిమాండ్

కదిరి టౌన్ : కదిరి పట్టణ, మండల పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని వైఎస్ఆర్‌సిపి విద్యార్థి విభాగం నాయకులు రాఘవేంద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన తన డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంఇఒ చిన్నకృష్ణకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాహక్కు చట్టాన్ని తుంగలో తొక్కుతూ నిర్వహిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నారాయణ పాఠశాల నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తోందన్నారు. అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తోందన్నారు. టెక్నో ,ఒలింపియాడ్,నాన్ టెక్నో పేర్లతో విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీ చేస్తోందన్నారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వంకధార రాఘవేంద్ర, ఆసిఫ్, మనోజ్, శ్రీకాంత్, విష్ణు, నరసింహ నాయుడు, గురుబాషా, పవన్, ఖాదర్ బాషా, ముబారక్, మంజు తదితరులు పాల్గొన్నారు.

'సామకోటి'కి నేషనల్ ఇంటిగ్రేషన్ అవార్డు

బుక్కపట్నం : పెనుగొండలో బాబయ్య స్వామి 750 సంవత్సరాల ఉరుసు మహోత్సవంలో భాగంగా గ్రామానికి చెందిన సత్యసాయి టిడిపి జిల్లా నాయకులు సామకోటి ఆదినారాయణకు నేషనల్ ఇంటిగ్రేషన్ అవార్డును దర్గా మత పెద్దలు అందించారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత మాట్లాడుతూ తాను చేసిన సేవా కార్యక్రమాలను , సామాజిక కార్యక్రమాలను గుర్తించి తనకు ఈ అవార్డు దక్కినందుకు సంతోషంగా ఉందన్నారు.భవిష్యత్తులో సత్యసాయిబాబా స్ఫూర్తితో మరెన్నో సామాజిక కార్యక్రమాలు చేస్తానని తెలిపారు . ఈ సందర్భంగా అవార్డు అందజేసిన మత పెద్దలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దర్గా మత పెద్దలు , కమిటీ సభ్యులు , మహబూబ్ బాషా , రమేష్ నాయుడు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యేలు

గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి, తదితరులు

గుడిబండ : ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మడకశిర ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి పేర్కొన్నారు. మండల పరిధిలోని జమ్ముల బండ పంచాయతీ రామయ్యనహట్టి గ్రామంలో గురువారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం ప్రజలకు అందజేస్తున్న ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర వక్కలిగల సంఘం చైర్పర్సన్ నళిని, ఎంపీపీ రాధమ్మ, జెడ్పీటీసీ భూతరాజు, సింగల్ విండో అధ్యక్షులు చంద్రప్ప, ఎంపీడీవో రామారావు, తహశీల్దార్ నాగభూషణం, వైస్ ఎంపీపీ రత్నమ్మ, శివన్న, వైసిపి నాయకులు పాండురంగప్ప, ఈరన్న, శివకుమార్, గిరిధర్ నాయక్, డీలర్ పుట్టప్ప, డీలర్ల సంఘం ఉపాధ్యక్షులు శివరాజ్, సచివాలయ సిబ్బంది, వాలెంటీర్లు, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తనకల్లు : మండల పరిధిలోని గేమేనాయక్ తండా, పోమేనాయక్ తండా, మోతుకులకుంట తండా, మోటుచింతమాను తండా, గద్దలబండ తండా, వేపుల పల్లిలో గురువారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాసంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సంబందిత అధికారులను ఆదేశించారు, ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మధుసూదన్ రెడ్డి, ఎంపీడీవో నరసింహులు, శ్రీనివాసులు నాయుడు, ఎస్ఎండి ఇస్మాయిల్, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఈశ్వర్ రెడ్డి, సర్పంచులు నాగేంద్రబాబు, సురేష్ రెడ్డి, రామ్ దేశాయ్,నీలకంఠారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చీకటి జీవోలను రద్దు చేయాలి : టిడిపి

హిందూపురం : ప్రజా గొంతు నొక్కే విధంగా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన చీకటి జీవోలను వెంటనే రద్దు చేయాలని టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు జిఒను రద్దు చేయాలని కోరుతూ గురువారం స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో రోడ్డుపై బైఠాయించి, ప్లకార్డులు ప్రదర్శించి జిఒ ప్రతులను చింపి కాల్చారు. ఈ సందర్భంగా టిడిపి సీనియర్ నాయకులు నాగరాజు, నెట్టప్ప, రాష్ట్ర నాయకులు అంజినప్ప, పట్టణ అధ్యక్షులు రమేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళన చేయడం రాజ్యాంగం కల్పించిన హక్కు అన్నారు. కావున రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన చీకటి జీవోను, 1861 పోలీస్ యాక్ట్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రాము, రామాంజినమ్మ, పరిమళ, వెంకటేష్, ఆర్‌ఎంఎస్ షఫీవుల్లా, అజ్మతుల్లా, అమర్నాథ్, జయప్ప, కౌన్సిలర్ సతీష్‌కుమార్, రాఘవేంద్ర, మాజీ జెడ్పిటిసి ఆదినారాయణ, శివశంకర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మడకశిర : సభలు సమావేశాలను నిషేధిస్తూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సర్కార్ జీవో నెంబర్.1 విడుదల చేసి ప్రజాస్వామ్యానికి తూట్లు పొడిచిందని తెలుగుదేశం పార్టీ నాయకులు విమర్శించారు. గురువారం పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం, అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రభుత్వం వ్యతిరేకంగా నిరసన తెలుపుతూ ధర్నా నిర్వహించారు. జీవో నెంబర్ 1 ప్రతులను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున, పుల్లయ్య చౌదరి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం, మడకశిరలో నిరసన వ్యక్తం చేస్తున్న టిడిపి నాయకులు